
# ఐ లవ్ యూ

కల్లూరి హైమారెడ్డి



ఆడపెళ్లివారిల్లు. పెళ్లికళతో కళకళలాడ్తూ సందడిగా ఉంది. పచ్చని గేటు కిరుపక్కలా అరటిచెట్లు పాతారు. గెలల భారానికి చెట్లు పడిపోకుండా పచ్చని వెదురుబొంగులు నాటారు. గేటులోపల నుండి ఆ ఇంటి వరండాను తాకేలా పచ్చటి కొబ్బరిమట్టలతో చిక్కటిపందిరి వేశారు. పందిరిరాటలకు కొబ్బరి మట్టలతో జడగా అల్లి బంతిపూలదండలు కట్టారు.

పందిరంతా మామిడితోరణాలు కట్టి, చిన్ని చిన్ని రంగురంగుల బల్బులు డిజైన్లగా అమర్చారు. గేటుపైన ఎత్తుగా ఆర్చికట్టి, చేమంతిపూలరేకుల వత్తుపై గులాబీ రేకులతో 'సమీరా వెడ్స్ సాహిత్' అనీ పేర్లను కూర్చారు. కాలం చటుక్కున వెనక్కు తిరిగి పాతకాలాన్ని మరోమారు గుర్తు చేస్తున్నట్లుంది. ఎత్తైన అరుగుల మీద తాటిఆకులతో అల్లిన కొత్తచాపలమీద కూర్చున్న వాయిద్యకారులు నాదస్వరంలో పెండ్లిపాటలు వినిపిస్తున్నారు. "మైక్ పెట్టించాలనుకున్నాము శారదా, కానీ మా అల్లుడుగారికి ఇష్టముండదట. పాపం మా వియ్యపురాలుగారు ఈ మాట చెప్పటానికి చాలా బాధపడిపోయాడనుకో" - పెండ్లికూతురు సమీర తల్లి యశోద తమ పక్కింటి ఇల్లాలితో చెప్పింది.

అప్పుడే అక్కడికి వచ్చిన సాహిత్‌తల్లి వసుంధర ఆ మాటలు వింది. "నిజమేనమ్మా. అన్ని సరదాలతో, ఆచారాలతో, పట్టింపులతో పెళ్లి చేయాలని నా కోరికమ్మా! మా పెద్దాడి పెళ్లీ , ఒక్కగానొక్క కూతురి పెళ్లీ అలాగే చేశాం. ఇదిగో ఆఖరివాడు. ఏ సరదానూ సాగనివ్వడు. ఏవీ వద్దంటాడు. మహా సీరియస్ మనిషమ్మా. అందుకేవాడంటే బెదురు అందరికీ.." అంటూ.

"అయ్యో బయటే నిలబెట్టేసి మాట్లాడేస్తున్నాం. రామ్మా లోపలికి" అంటూ లోపలికి దారితీసింది. వసుంధరే ముందుగా. అప్పటికి పెండ్లి జరిగి రెండోరోజు.

మగపెళ్లి వారమనే గర్వం, నిక్కపొడుపుతనం చూపకుండా, వేటికీ వంకలు పెట్టకుండా అందరితో కల్సిపోయి తిరుగుతున్న వసుంధరను చూస్తుంటే.... పెండ్లికి వచ్చిన బంధువులకు యశోద అదృష్టంమీద అసూయ కలిగింది.

"అమ్మా, నిధి నీకోసం ఏడుస్తోందే, ఇదుగో, ఎత్తుకో బాబూ" అంటూ వసుంధర కూతురు సంగీత ఎదురొచ్చింది.

"మా అమ్మాయి సంగీత. దీని కూతురు, నా మనుమరాలు నిధి ఇది"అంటూ వసుంధర శారదకు పరిచయం చేసి నిధిని చేతుల్లోకి

## స్వాగతగీతి

స్వాగతము నీకు బహుధాన్యవత్సరంబ
కువలయానందకరనుత గుణకదంబ
సరసయౌవనసౌదర్యస్వావలంబ
సుజనవందిత సౌభాగ్యశోభితంబ!
నీదురాకను గమనించి నిఖిలజగతి
పచ్చతోరణముల నులివెచ్చదనపు -
టమల సౌఖ్యానురాగసోయగముతోడ
పులకరించుచునుండె సొంపులు దలిర్ప!
తీయమామిడి చివురులతీపి తనదు
కంఠసీమలో నిలిచి యుత్కంఠరేప
పాడుచున్నది కోకిల పరవశమున
విశ్వమానవహృదయసంవేద్యగీతి!
అవని సుఖదుఃఖములు నాట్యమాడుననుచు
నీయుగాది పచ్చడి తెల్పు నెల్లరకును
ఓ యుగాధిప! నీరాక యుర్విజనుల
కఖిలసుఖముల నిడునన్న ఆశ కలదు!
ఏదియేమైన యిన్నాళ్ల కిల్లుచేరి
పలుకరించితి వదియ సంబరముమాకు
నీదు పేరుప్రఖ్యాతులు నిలుపుకొనుచు
పాలనము సేయుమింక భూప్రజలు మెచ్చ!

**ఎం.పి. జానుకవి**

తీసుకుంది వసుంధర. ఫేరెక్స్, ఆపిల్స్, ద్రాక్షారసంలో కలిపిపెట్టిపెంచుతున్నట్లుంది నిధి. పట్టులంగా, పట్టుజాకెట్టు, మెడలోనూ, కాళ్లకూ, చేతులకూ నడుముకూ, పాపిటకూ పెట్టిన నగలతో బంగారుబొమ్మలా మెర్సిపోతోంది. సంగీత కూడా కూతురితో సమంగా అలంకరించుకుంది.

సంగీత, శారదను చూసి స్నేహంగా నవ్వుతూ 'మా ఆంటీకి ఫ్రెండా మీరు'అనడిగింది. యశోద భుజాలచుట్టూ వేసి నిలబడ్తూ. అవునంటూ తలూపిన శారదకు ముచ్చటగానూ అద్భుతంగానూ ఉంది ఆ వాతావరణం.

"ఎన్నిసార్లని తిరుగుతారు. మీరు కూర్చోండి వదినా, నిన్నంతా పెండ్లిపనులతో అలిసిపోయారు. అమ్మా సంగీతా! పెద్దవదినా నువ్వూ కలిసి కాస్త ఆ కాఫీలపని చూడండి. మావయ్యాగార్కి, నాన్నగార్కి, అన్నయ్యలకు కాఫీలు పంపండి. అలాగే మాక్కూడా. ఏమ్మా శారదా, మీరు కాఫీ నా?టీనా? మీరమ్మా?"అంటూన్న వసుంధరని చూస్తూ....

"మా సమీర చాలా అదృష్టవంతురాలు వదినగారూ! "అంటూ శారద కూడా వరస కలిపేసింది.

"ఏమో తల్లీ! నీ మాట నిజమయ్యి... మా సమీరతో అయినా వాడు సరిగ్గా వుంటే నాకదే పదివేలు. మాపెద్దవాడు మరీ మెతకమనిషమ్మా! పెద్దకోడలూ అంతే . చాలా నెమ్మదస్తురాలు. ఇక ఆయనంటారా? పేరుకి పెద్దఆఫీసరే కాని మహాసింపుల్ అంటే నమ్మండి. మా అదృష్టం కొద్దీ మా అల్లుడుగారూ అంతే! " అందావిడ. అదీ నిజమే. అప్పటికి నాలుగైదుసార్లు సంగీత భర్త రామచంద్ర అత్తగారి దగ్గరికి వచ్చాడు. 'పాపనిలా ఇవ్వండి అత్తగారూ! మీకు బరువు." అంటూ...

'అందరూ కాఫీలు తీసుకున్నారాండీ. మరదిగారు మాత్రం తనకేం వద్దన్నారండీ' వసుంధర పెద్దకోడలు సుమతి అందరికీ కాఫీ ఇస్తూ చెప్పింది.

"అయ్యో! అల్లుడుగారు ఏం తీసుకుంటారో" అంటూ యశోద హడావిడి పడిపోయింది.

"పోనీ నేను వెళ్లి అడుగుతాను. అహఁ కాదు, సమీరను పంపిస్తే?" అక్కడే ఆ ఆడవారి గుంపులో కూర్చున్న సమీర ఉలిక్కిపడింది.

"బాప్‌రే! నేనా? ఊహూఁ" అంది. నిన్నటినుండీ ఆ అమ్మాయి మనసులో మనసు లేదు. అత్తమామ, ఆడబడుచులు, తోడికోడలు, చివరికి బావగారు కూడా ఆ అమ్మాయిని ఎంతో అభిమానంగా పలకరించి మాట కలిపారు. కానీ ఏం లాభం? అసలుసిసలు కావల్సిన భాగస్వామి....

కనీసం చూపుల్తో కూడా పలకరించలేదు. పెండ్లిలోనూ అంతే. అసలు పెళ్లి జరుగుతున్నది అతనితోనా? లేక అతని నీడతోనా? అనే అనుమానం కూడా కలిగింది సమీరకు. పోనీ ఇష్టం లేని పెండ్లా అంటే?.....

'మాకు పిల్ల నచ్చింది. వాడే పూర్తిగా ఒప్పు కుంటే అదే చాలుమాకు...'అన్నారు సమీర మామగారు పెళ్లిచూపులు తంతు తర్వాత. ఇంటికి ఫోన్ చేశారు. అబ్బాయి ఇష్టపడ్డాడు. వెంటనే ముహూర్తాలు పెట్టుకుందామంటూ..."

అప్పటినిండీ అన్నిపనులూ సవ్యంగా, శీఘ్రంగా జరిగిపోయాయి. పెండ్లితో సహా. ఎటొచ్చీ....

హీరోయిన్‌ని హీరో టచ్ చెయ్యని సినిమాలా...పెండ్లి తంతు ముగించాడు సాహిత్. అదిగో అప్పట్నుంచీ సమీర గుండెల్లో గుబులు మొదలయింది. 'అంగట్లో అన్నీ ఉన్నా..." సామెతలా కాదుకదా తన బతుకు అనే అనుమానం కూడా మొదలైంది. మరి భరించలేక బామ్మను చాటుకు తీసుకువెళ్లి .....

"బామ్మా భయమేస్తోందే అతని వరస చూస్తుంటే" అంది దిగులుగా.

"అతను తప్ప ఆ ఇంట్లో అందరూ మంచివాళ్లే" అని కూడా అంది విచారంగా.

మనవరాలి భయం చూసి బామ్మ పకపకా నవ్వేసింది. ఆ పైన మనవరాలి బుగ్గలు రాస్తూ ....

"ఓసి వెర్రిమొహమా! ఆడవాళ్ల జీవితాలు సుఖంగా వుండాలంటే మొదట అత్తగారూ, ఆడపడుచులూ మంచివాళ్లయి వుండాలి. మొగుడనే మగాడంటావా? పసివాడు. చూస్తూవుండు . రేపురాత్రే కార్యం కాస్తా జరిగి అడ్డుతొలగిపోతే ఎల్లుండి పొద్దున్న వచ్చి నువ్వే నాతో అంటావు."

"బాప్‌రే! బామ్మా! నీకో దండం. నేరకపోయి నా బాధ నీకు చెప్పుకున్నా కదా!" అంటూ లోపలికి పరిగెత్తింది సమీర.

* * *

శారద రాత్రి..... శరత్ వెన్నెల

మెత్తని తెల్లని బంగారుఅంచు చీరతో...

వత్తైనజడలో పెట్టుకున్న జాజుల గుభాళింపుతో నెమ్మదిగా...అతి నెమ్మదిగా....అత్తగారు భుజంచుట్టూ చేయి వేసి నడిపిస్తూంటే నడుస్తూ.....

"లోపలికి వెళ్లమ్మా" ప్రేమగా వసుంధర కోడలితో.

సమీర అరచేతుల్లో భయం తీలూకు చెమటతో కాళ్లు కదల్చలేకపోతుంది. అస్సలు కుదరదు గాక కుదరదు గానీ, లేకుంటే రెండు రోజుల్లోనే అమ్మకంటే ఎక్కువగా చేరువైన అత్తగారి చేయి పట్టుకుని, నాకు భయమేస్తోంది. మీరూ రండి" అనేలా ఉంది సమీర.

"లోపలికి వెళ్లమ్మా!"మళ్లీ చెప్పారు అత్తగారు.

కాళ్లకు చెవులు లేవు లేవు కాబట్టి వాటికి వినబడటం లేదు అన్నట్లు నిల్చిపోయింది సమీర.

"సమీ, లోపలకి వెళ్లు" అమ్మా బామ్మా ఒక్కసారిగా హెచ్చరించేసరికి రోషించిన సమీర చటుక్కున గదిలోకి అడుగేసింది. గభాల్న బామ్మ తలుపు దగ్గరకు లాగి గడియపెట్టేసింది.

తలుపు వెనుక వణికే విగ్రహమయ్యింది సమీర.

సాహిత్ అతనే దగ్గరకు వచ్చాడు. తన కుడిచేతి నాలుగువేళ్లతో తొలిసారి గా భార్య చుబుకాన్ని స్పృశిస్తూ ముఖాన్ని పైకి ఎత్తి 'సమీ భయపడ్తున్నావా?'అంటూ నవ్వుతూ చూశాడు.

ఎందుకో గుండె జలదరించింది. ఒళ్లంతా పారిజాతాలు తాకిన పులకింత. ఒక మత్తు అతనినుండి తన్ను ఆవరించినట్లై కొన్ని క్షణాలు ఏదీ గ్రహించలేని స్థితికి లోనై గ్రహింపు వచ్చేసరికి మంచం మీద అతని ఎదపై తను. వీపును బిగించిన అతని చేతులు చెప్పే ప్రేమభాషకు ఆమె తనువు రెస్పాండ్ అయింది.

సాహిత్ నుండి మరల అదే ప్రశ్న .

"సమీ భయపడ్తున్నావా? "

సమీరకు బదులివ్వడానికి మాటలు కుదరటంలేదు.

"అత్తగారు..... మీతో ...నేను ...ఎలా ప...డ్తానా..ని"

"మంచం మీదనా" అని అడిగాడు.

సమీర మనసుకు రెండు రోజులుగా అతని తాలూకు దూరం హఠాత్తుగా మాయమై హత్తుకుపోతున్నా దగ్గరి తనంతో ఇష్టంగా చూసింది భర్త వైపు. భార్య ముంగురులు సవరిస్తూ చెప్పాడు.

"అమ్మ చాలామంచిదే సమీ. చాదస్తమెక్కువ. సంప్రదాయం, ఆచారాలం టూ విపరీతంగా ఖర్చులు పెట్టించేస్తుంది. అక్క ఒంటిమీదా, ఆ పసిదాని ఒంటిమీదా నగలు చూశావుగా. అవన్నీ అమ్మ చేయించినవే! తనుపోయిన తర్వాత అక్కని మేంచూస్తామో లేదోనని భయంతో ఆ నగలన్నీ నాన్న జీతంతో, అన్న సంపాదనతో చేయించినవే! 'మగపిల్లలు, వాళ్లకేం సంపాదించుకుంటారు'', అనుకుంటుందే కానీ, బావ కూడా మగవాడేనని, అతని సంసారం కోసం అతనే సంపాదించాలని ఆలోచించలేదు.అన్న పెళ్లిలో, అక్కపెళ్లిలో ఆచారాలంటూ విపరీతంగా డబ్బు వేస్ట్ చేసింది."

"బాగుండదురా... వాళ్లేమనుకుంటారో... వీళ్లేమనుకుంటారో"'అంటూ మొదలుపెడుతుంది. మాకేమో వెనక నిల్వఆస్తులు లేవు. నాన్నగానీ, అన్నగానీ, వదిన గానీ, ఎవరూ ఆమె ముందు ఏమీ అనలేరు. వెనుక బాధపడ్తారు. ఇటువంటి పరిస్థితిలో మొత్తంగా ఇంటిక్షేమం కోసం చిన్నవాడినైనా నేను కఠినంగా వ్యవహరించక తప్పలేదు. ఫలితంగా అమ్మ ప్రేమకు దూరమయ్యాను,"

భర్త చివరిమాటలు వినేసరికి సమీరలో భర్తపట్ల విపరీతమైన ప్రేమవెల్లువై ప్రవహించగా........

భార్య తాలూకు తొలిస్పర్శకు పులకరిస్తున్న అతని ఎదపై నుండి తన మెడను కాస్త పైకి సాచి, భర్త నుదుటిపై ముద్దిస్తూ సమీర అపురూపంగా చెప్పింది..."ఐలవ్ యూ"

■


స్థాపితం - 1975

ఉగాది శుభాకాంక్షలు

51350
ఫోన్ 52314

ప్రగతి పథంలో...

బాలాజీ కో-ఆపరేటివ్ సూపర్‌బజార్

పలమనేరు

1991 సం॥లో రు. 7.25 లక్షలతో స్వంత భవనం నిర్మాణం చేయడమైనది.
1994 సం॥లో వి. కోటలో బ్రాంచి ద్వితీయ ప్రారంభం



ప్రస్తుత మూలధనం - రు. 6,30,000
ప్రస్తుత సభ్యుల సంఖ్య - 6,000
గ్రామీణ ప్రజల సౌక ర్యార్థం త్వరలో సంచార సూపర్ బజార్ ప్రారంభం

శుభ్రతకు-నాణ్యతకు-రుచికి పేరొందిన
సూపర్‌బజార్ సరుకులనే కొనండి
మీ ధనం పొదుపు చేసుకొనండి



ఇట్లు: శ్రీ ఆర్.వి. సుబాస్ చంద్రబోస్
అధ్యక్షులు మరియు పాలకవర్గ సభ్యులు